www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 24 డిసెంబర్ 2025

5

ఏలూరు

హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యాన విద్యార్థినికి సాయం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పోలరౌతు కుందనశ్రీ అనే ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థినికి శ్రీసాయి హెల్పింగ్ హ్యాండ్ ఆధ్వర్యాన రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. డీ మార్ట్ సమీపంలోని బ్రహ్మంగారి గుడి వద్ద నివసిస్తున్న కుందనశ్రీ తండ్రి శ్రీనివాస్ ఇటీవల మరణించడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. తల్లి లావణ్య ఆధారంతో చదువుకుంటున్న ఈ విద్యార్థినికి ఫీజు చెల్లింపు కష్టసాధ్యంగా మారిన నేపథ్యంలో మానవతా దృక్పథంతో శ్రీ సాయి హెల్పింగ్ హ్యాండ్ స్పందించింది. ఈ సందర్భంగా మంగళవారం సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ కె.పంకజ్ కుమార్ చేతుల మీదుగా రూ.10 వేల నగదు సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయ సంఘం గౌరవ అధ్యక్షులు గారపాటి ప్రకాష్ రావు, ఫ్యాప్టో ఛైర్మన్ జి.మోహన్, శ్రీసాయి హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు పి.వెంకటరమణ, ఇ.శ్రీనివాసరావు, డికెఎస్ఎస్.ప్రకాష్ పాల్గొన్నారు.

అడ్డగోలు భూ సేకరణపై.. తేల్చండి..!



దళారులు ఇస్తున్న చెక్కు

- రెడ్డిగణపవరం గ్రామసభలో అధికారులను నిలదీసిన గ్రామస్తులు
- పీసా కమిటీ లేకుండా తీర్మానం చేసి నోటిఫికేషన్లు జారీ ఎలా?
- అభ్యంతరాలు, కోర్టు ఆదేశాలున్న భూములను ఎలా సేకరిస్తారు
- ఫిర్యాదులో పేర్కొన్న ప్రతి సర్వే నెంబర్‌పైనా తేల్చాలని డిమాండ్
- ప్రలోభ పెట్టేందుకు దళారుల చెక్కుల జారీపైనా చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలవరం నిర్వాసితుల కోసం బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలంలో చేపట్టిన అడ్డగోలు భూసేకరణపై గిరిజనులు మండిపడుతున్నారు. రెడ్డిగణపవరంలో మంగళవారం భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో గ్రామస్తులు అధికారులకు పలు ప్రశ్నలు సంధించారు. ఇప్పటి వరకూ జారీ చేసిన భూసేకరణ నోటిఫికేషన్లపై అనేక అభ్యంతరాలు ఉన్నాయని గిరిజనులు గళమెత్తారు. పిజిఆర్ఎస్‌లోనూ, ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదుల రూపంలో ఇప్పటికే తెలిపామని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టుతో ముంపునకు గురవుతున్న ఎఎస్ఆర్ జిల్లాలోని విఆర్‌పురం, కూనవరం మండలాల్లోని 35 గ్రామాల ప్రజలను తరలించేందుకు ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లో 7,100 ఎకరాలు సేకరించేందుకు అధికారులు ముందుకు సాగుతున్నారు. 6,700 ఎకరాలు భూమికి భూమి కింద, మరో 400 ఎకరాలు కాలనీలకు అవసరమని తేల్చారు. నిబంధనల ప్రకారం భూసేకరణ చేసేటప్పుడు గ్రామసభ తీర్మానించడం, డాక్యుమెంట్ వెరిఫికేషన్ చేసి ప్రక్రియ ముందుకు సాగించాలి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో ఇది అత్యంత ప్రధానంగా చేయాలి. అందుకు విరుద్ధంగా అధికారులు ముందుకు సాగుతున్నారు. దళారులతో చేతులు కలిపి అడ్డగోలుగా భూసేకరణ చేయడంపై రెడ్డిగణపవరం గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. గిరిజనుల సాగులో ఉన్న భూములు, ఎల్‌టిఆర్ వివాదాలు కలిగిన భూములు, గిరిజనులకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చిన భూములను సైతం అధికారులు సేకరిస్తున్నారు. గిరిజనేతర భూస్వాములకు మేలుచేసేలా ముందుకు సాగుతున్నారు. దీంతో రెడ్డిగణపవరం గ్రామస్తులు ఉన్నతాధికారులకు అనేక ఫిర్యాదులు ఇచ్చారు. రెడ్డిగణపవరం గ్రామంలో దాదాపు 30 సర్వే నెంబర్లకు సంబంధించి 75 ఎకరాల భూములపై కొంతమంది ఫిర్యాదు చేయగా, మరికొంతమంది మరిన్ని సర్వే నెంబర్లకు సంబంధించి అభ్యంతరాలు వ్యక్తం చేశారు.



క్ర.సం.	రి.స.నం	1933 RSR రికార్డులో నమోదు అయినవారు	1975-76 అడంగల్ రికార్డులో నమోదు అయినవారు	ఆర్&ఆర్ లిస్ట్‌లో ప్రకటించినవారి పేరు
1.	92/1	కొప్పుల నారాయణస్వామి	బొర్రా చంద్రయ్య	పిచ్చుకల కనకదుర్గ
2.	39/1	జయవరపు సుబ్బయ్య	జయవరపు సుబ్బయ్య	పుసులూరి శ్రీనివాసరావు
3.	190/1	మద్దిరాల క్రిష్ణయ్య	మద్దిరాల బుల్లెమ్మ	కోనే కనకదుర్గ
4.	198/1	మద్దిరాల క్రిష్ణయ్య	మద్దిరాల బులివెంకమ్మ	కోనే కనకదుర్గ
5.	241	కురం వెంకటస్వామి	భూమరాజు రామకృష్ణంరాజు	పుసులూరి భారతి
6.	259	చింతలపాటి బాపిరాజు	చింతలపాటి బాపిరాజు	పసుమర్తి సుబ్బారా[illegible]
7	303	చింతలపాటి బాపిరాజు	గద్దె దుర్గయ్య	[illegible]
8	303/1బి	చింతలపాటి బాపిరాజు	వేముల లక్ష్మీ కాంతం	[illegible]
9.	313	కొల్లూరి వెంకట సుబ్బారావు	మామిళ్ళపల్లి కోటేశ్వరరావు	పుట్టా వీరభద్రం

క్ర.సం.	రి.స.నం	1933 RSR రికార్డులో నమోదు అయినవారు	1975-76 అడంగల్ రికార్డులో నమోదు అయినవారు	ఆర్&ఆర్ లిస్ట్‌లో ప్రకటించినవారి పేరు
10	353/2	మధిర వెంకట రామ మనోహరం	మధిర వెంకట రామ మనోహరం	అల్లూరి భగవాన్‌రాజు
11.	353/3	మధిర వెంకట రామ మనోహరం	మధిర వెంకట రామ మనోహరం	అల్లూరి భగవాన్‌రాజు
12	353/4	మధిర వెంకట రామ మనోహరం	మధిర వెంకట రామ మనోహరం	అల్లూరి భగవాన్‌రాజు
13.	48[illegible]	[illegible]	[illegible]	[illegible]

రికార్డుల్లో ఉన్న పేర్లు..అధికారులు జారీచేసిన భూసేకరణ జాబితాలో ఉన్న పేర్లు జాబితా

రెడ్డిగణపవరంలో పీసా కమిటీ లేదు. పీసా కమిటీ ఆమోదం లేకుండానే భూసేకరణకు సంబంధించిన నోటిఫికేషన్లు విడుదల చేశారు. గతంలో జరిగిన గ్రామసభలో అక్కడి ప్రజలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పేర్కొన్న సర్వే నెంబర్లను మళ్లీ మళ్లీ నోటిఫికేషన్లలో ఇస్తున్న పరిస్థితి ఉంది. గ్రామంలో పీసా కమిటీ లేకుండా తీర్మానాలు ఏవిధంగా చేశారో అధికారులు చెప్పాల్సి ఉంది. టైటిల్ రికార్డు వెరిఫికేషన్ చేయాలని కోరుతున్నా పట్టించుకోకుండా ముందుకు సాగుతున్న తీరు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సర్వే నెంబర్ 92-1లో 1975-76 అడంగల్ రికార్డులో బొర్రా చంద్రయ్య పేరు ఉండగా అధికారులు ప్రకటించిన ఆర్అండ్ఆర్ జాబితాలో పిచ్చుకల కనకదుర్గ పేరు ఉంది. సర్వేనెంబర్ 39-1లో అడంగల్ రికార్డులో జయవరపు సుబ్బయ్య పేరు ఉండగా ప్రకటించిన జాబితాలో పుసులూరి శ్రీనివాసరావు పేరు ఉంది. ఈ విధంగా దాదాపు 13 సర్వే నెంబర్లలో రికార్డుల్లో ఒక పేరు, అధికారులు ప్రకటించిన ఆర్అండ్ఆర్ జాబితాలో మరో పేరు ఉంది. మరో సర్వే నెంబర్లకు సంబంధించి ప్రస్తుతం ఉన్న భూమి స్థితిపైనా గిరిజనులు ఫిర్యాదు చేశారు. రికార్డుల వెరిఫికేషన్ చేయకుండా ఏవిధంగా భూసేకరణ చేస్తున్నారో అధికారులు చెప్పాల్సి ఉంది. మంగళవారం జరిగిన గ్రామసభలో గ్రామస్తులు అంతా ముక్తకంఠంతో ఒక్కటే కోరారు. ఇప్పటి వరకూ జారీ చేసిన నోటిఫికేషన్లవారీగా రికార్డు వెరిఫికేషన్ చేయాలని డిమాండ్ చేశారు. మరోసారి రికార్డు వెరిఫికేషన్‌పై సమావేశమవుదామని అధికారులు వెనుదిరిగినట్లు తెలిసింది.

ప్రలోభాలు పెట్టేందుకు చెక్కుల జారీపై జనాల్లో తీవ్ర చర్చ

గ్రామస్తుల ఆమోదం లేకుండా పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ పూర్తి చేసేందుకు దళారులు రంగంలోకి దిగారు. దీనికోసం స్థానిక ప్రజాప్రతినిధులకు రూ.మూడు లక్షల చొప్పున చెక్కులు అందించి దళారులు ప్రలోభ పెడుతున్నారని గ్రామస్తుల్లో చర్చ సాగుతోంది. కొంతమంది స్థానిక ప్రజాప్రతినిధులు దళారులు ఇచ్చిన చెక్కులను తిరస్కరించారు. అధికారులకుసైతం ఇదేవిధంగా మామూళ్లు పెద్దఎత్తున ముట్టజెబుతున్నట్లు గుప్పుమంటుంది. ఈ కారణంగానే టైటిల్ రికార్డు వెరిఫికేషన్ లేకుండా భూసేకరణ చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రికార్డుల వెరిఫికేషన్ పక్కాగా చేసి అభ్యంతరాలున్న భూములను భూసేకరణ నుంచి తొలగించాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

గిరిజన మహిళను నెట్టేస్తున్న మగ పోలీసు

ఇనుమూరు గిరిజనులపై దౌర్జన్యకాండ

ఓపక్క గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి. వారి సంక్షేమం పట్ల అలసత్వం వహించొద్దు.. వారి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కేంద్రం ఏలూరులో కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులకు ఆదేశాలిస్తుంటే.. అదే సమయంలో జిల్లాలోని బుట్టాయగూడెం మండలం ఇనుమూరు గ్రామంలో గిరిజనులపై రెవెన్యూ, పోలీసుల అధికారుల దౌర్జన్యకాండ చర్చనీయాంశమైంది. ప్రభుత్వ భూముల్లో గిరిజనులు సాగు చేసుకుంటుంటే ఆ భూములకు రెవెన్యూ అధికారులు ప్రొటెక్షన్ ఆర్డర్ ఇవ్వడం ఏమిటో అర్థం కాని పరిస్థితి. వాటిని అడ్డంపెట్టుకుని గిరిజనులు సాగు చేసిన మొక్కజొన్న పంటను ట్రాక్టర్లతో ధ్వంసం చేయించడం, దీన్ని అడ్డుకున్న గిరజనులపై దౌర్జన్యకాండకు దిగడం చూస్తుంటే ప్రభుత్వం, జిల్లా అధికారులు గిరిజనుల సంక్షేమంపై వల్లె వేస్తున్న మాటలు నేతి బీరకాయలో నెయ్యి చందమేనని అంతా విమర్శిస్తున్నారు.

వార్త మెయిన్‌లో..

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరబ్‌గౌర్

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరబ్‌గౌర్ వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి ఆయన జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వితో కలిసి ప్రభుత్వాసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రిలోని వివిధ వార్డులను పరిశీలించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ రోగులతో నేరుగా మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి విభాగంలో అందుతున్న చికిత్సలు, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఆసుపత్రిలోని పలు వార్డుల్లో రోగులు వినియోగించే మరుగుదొడ్లు సరిగా నిర్వహించకపోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహించడంపై సంబంధిత అధికారులను ప్రశ్నించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కొరత, పరికరాల కొరత తదితర సమస్యలను కలెక్టర్ వెట్రిసెల్వి ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే సిబ్బంది నియామకాలు, అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని సౌరబ్‌గౌర్ హామీ ఇచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఎంఎస్.రాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పిజె.అమృతం, ఇతర వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న సౌరభగౌర్

నేడు పోలవరంలో అథార్టీ బృందం పరిశీలన

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు సిఇఒ నేతృత్వంలో పోలవరం ప్రాజెక్టు అథార్టీ బృందం బుధవారం పోలవరం ప్రాజెక్టును, పోలవరం పునరావాస గ్రామాలను సందర్శించనుంది. తొలుత ఈ బృందం రాజమహేంద్రవరం నుండి ఉదయం 9.30 గంటలకు ఎల్ఎన్‌డిపేట సమీపంలోని పోలవరం ప్రాజెక్టు పునరావాస గ్రామాలకు చేరుకుంటుంది. 11 గంటలకు ప్రాజెక్టు అతిథిగృహానికి చేరుకుంటుంది. 11.25 గంటలకు ఎగువ కాపర్ డ్యామ్ వద్ద నిర్మించిన బిట్రస్ డ్యామ్ వద్దకు చేరుకుంటుంది. అనంతరం గ్యాప్ 1, ఎర్త్ కం రాక్‌ఫిల్ డ్యామ్, డి హిల్, ఎగువ కాపర్ డ్యామ్ సమీపంలో ఉన్న పవర్ హౌస్ ప్రాంతాలను పరిశీలిస్తారు. 12.05 గంటలకు డిహిల్, ఎగువ దిగువ, కాపర్ డ్యామ్‌ల వద్ద, గ్యాప్-1 వద్ద ఫిల్టర్ లేయింగ్ పనులు, డయాఫ్రంవాల్ ప్రాంతంలో మట్టి నమూనాల పరిశీలన కార్యక్రమంలో పాల్గొంటారు. ఇసిఆర్ఎఫ్ డ్యామ్‌ల వద్ద ప్రతిపాదించిన నూతన నిర్మాణాల గురించి చర్చిస్తారు. అనంతరం ప్రాజెక్టు అతిథి గృహానికి చేరుకుంటారు. భోజన విరామం అనంతరం జలవనరులశాఖ అధికారులు, భూసేకరణ అధికారులు, ఎపి జెన్‌కో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. అనంతరం కుడి ప్రధాన కాలువ కనెక్టివిటీలో భాగమైన జంటగుహల నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తారు. అనంతరం గన్నవరం ఎయిర్‌పోర్టుకు బయల్దేరి వెళ్తారు.

వినతి అందిస్తున్న నేతలు

తల లేని మొండెంగా ఉపాధి హామీ చట్టం

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం విమర్శ : మార్పులొద్దని డ్వామా పీడీకి వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని తల లేని మొండెంగా తయారు చేసిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని వికసిత్ భారత్-2047లో భాగం చేస్తూ విబి జి ఆర్ఎఎం జి పథకం కింద మార్పు చేవారని మండిపడ్డారు. మంగళవారం ఉపాధి హామీ (డ్వామా) పీడీ వెంకట సుబ్బారావుకు సంఘం జిల్లా కమిటీ బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఎందుకు రద్దు చేయబోతున్నారని ప్రశ్నించారు. కొత్త పథకం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపర్చే చర్యలు ఏమిటని మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ కొత్త చట్టం ఉపాధిని లేకుండా చేస్తున్నదని, పని దినాలు 125 రోజులకు పెంచుతున్నట్లు చెప్పి 60 రోజులు పని నిషేధం విధించారని విమర్శించారు. బయోమెట్రిక్, ఎఫ్ఎంఆర్ఎస్‌ను చట్టబద్ధం చేయడం అంటే పేదలను ఉపాధి హామీ నుండి తొలగించడం తప్ప మరొకటి కాదని విమర్శించారు. అందుకే మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టంగానే ఉండాలని, 2025 విబి జి ఆర్ఎఎం జి పథకం వద్దేవద్దని అన్నారు. ఈ నెల 26న గ్రామ సభల్లో వ్యతిరేకించి ఆందోళనలు చేయాలని ఉపాధి కూలీలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.జీవరత్నం, నేతలు రాజశేఖర్, బాలరాజు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమంపై నిర్లక్ష్యం తగదు

అవసరమైన చోట్ల సెల్ టవర్లు ఏర్పాటు చేయాలి: కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

గిరిజనుల సంక్షేమం, అభివృద్ధితోపాటు వారి సమస్యల పరిష్కారంపై అలసత్వం వహించొద్దని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో మంగళవారం జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ గత అక్టోబర్‌లో జిల్లా పర్యటన సందర్భంగా ముందుకొచ్చిన అంశాలపై సాధించిన ప్రగతి, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమం, ఇతర సమస్యలపై 17 శాఖల అధికారులతో ఆమె మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్‌టి కమిషన్ సభ్యుల పర్యటనలో లేవనెత్తిన అంశాలపై నూరుశాతం లక్ష్యాలను సాధించాలన్నారు. మోదెల గ్రామ గిరిజనుల మనోభావాలకు అనుగుణంగా బుట్టాయగూడెం మండలంలోకి ఆ గ్రామాన్ని కలిపేందుకు తీర్మాన ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. రెడ్డిగూడెం, రాజానగరం, కోటరామచంద్రపురం ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు సిగ్నల్స్ లేవని ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సెల్‌టవర్ల మరమ్మతుతోపాటు కొత్తగా అవసరమైన సెల్ టవర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి అధికారులు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి వెంటనే స్పందించాలన్నారు. ఐటిడిఎ పరిధిలో గిరిజనులు, గిరిజన సంఘాల ప్రతినిధుల నుండి వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం చూపాలన్నారు. జఠిలమైన సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలన్నారు. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు భూసేకరణలో భూమికి భూమి ఇవ్వాలని, అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, జాబ్‌మేళాల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించవచ్చునని అన్నారు. అంతేగాని ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పవద్దని, ఉద్యోగాలు ఇచ్చే అధికారం మనకు లేదని స్పష్టం చేశారు. హెల్త్ సబ్ సెంటర్లకు 108 వాహనం వెళ్లేలా రహదారుల నిర్మాణంపై దృష్టి పెట్టాలన్నారు. గిరిజనులు జీవన ప్రమాణాలు మెరుగుదలకు అటవీ శాఖాధికారులు ఎటువంటి ఇబ్బందులు పెట్టవద్దని, విరివిగా అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, ఐటిడిఎ పిఒ కె.రాములునాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్రీడల పట్ల ఆసక్తి అవసరం

జిల్లా యూత్ ఆఫీసర్ సుంకర రాము

ప్రజాశక్తి - భీమడోలు

విద్యార్థులు విద్యతోపాటు క్రీడల పట్ల ఆసక్తి కనబరచాలని జిల్లా యూత్ ఆఫీసర్ సుంకర రాము కోరారు. భీమడోలు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ, జూనియర్ కళాశాల వేదికగా మంగళవారం మేరా యువభారత్ క్రీడా కార్యక్రమాలను జిల్లాస్థాయిలో నిర్వహించారు. జిల్లా పరిధిలోని వివిధ కళాశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్, ఇతర అంశాల్లో నిర్వాహకులు పోటీలు నిర్వహించారు. విజేతలకు మినిస్ట్రీ ఆఫ్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ వారు పతకాలు, ప్రశంసాపత్రాలు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్, జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ భవానీసింగ్ పాల్గొన్నారు.

విద్యార్థులతో ప్రముఖులు

అటవీ ప్రాంతాల్లో సోలార్ విద్యుత్ సరఫరాకు శ్రీకారం

ఏలూరు ఎస్ఇ పి.సాల్మన్ రాజ్

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

మండలంలోని కోయిదా పంచాయతీలోని మోదుల గ్రామానికి సోలార్ మినీ గ్రిడ్జ్ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించి, విద్యుత్ శాఖ ఏలూరు ఎస్ఇ పి.సాల్మన్ రాజ్ మంగళవారం విద్యుత్ సరఫరా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ విద్యుత్ సరఫరా వేయాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా విద్యుత్ శాఖ అడుగులు వేస్తుందని, అటవీ ప్రాంతాల్లో సాంకేతిక కారణాల వల్ల విద్యుత్ లైన్లు వేయడానికి వీలు లేని ప్రాంతాల్లో సోలార్ ద్వారా విద్యుత్‌ను సరఫరా చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈనేపథ్యంలో పివిటిజి కార్యక్రమం ద్వారా మోదెల గ్రామంలో 23 గిరిజన ఇండ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా మారుమూల అటవీ ప్రాంతాల్లోని గిరిజనులకు కూడా విద్యుత్తును సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈక్రమంలోనే మోదెల గ్రామంలో సోలార్ మినీ గ్రిడ్జ్ ద్వారా 23 ఇండ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. అంతేకాకుండా ఒక్కో ఇంటికి తమ శాఖ ద్వారా 5 లైట్లు, ఒక ఫ్యాన్ కూడా ఉచితంగా అందజేశామన్నారు. సోలార్ ద్వారా బ్యాటరీ అనుసంధానంతో నిరంతరం వీరికి విద్యుత్ సరఫరా జరుగుతుందని వివరించారు. అనంతరం విద్యుత్ శాఖ జంగారెడ్డిగూడెం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ.. డివిజన్లో ఇప్పటి వరకు పివిటిజి ద్వారా ప్లెయిన్ ఏరియాలో 1196 ఇండ్లకు, గిరిజన ప్రాంతంలో 23 ఇండ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. అనంతరం మోదెల గ్రామస్తులు మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతంలో ఉన్న తమను గుర్తించి విద్యుత్ సరఫరా చేసిన ప్రభుత్వానికి, విద్యుత్ శాఖ అధికారులకు రుణపడి ఉంటామని, సంబంధిత శాఖాధికారులకు సన్మానాలు చేసి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు టెక్నికల్ ఇఇ టి.శశిధర్, జీలుగుమిల్లి డిఇఇ కె.రమేష్, కొయ్యలగూడెం డిఇఇ వై.మధు, వేలేరుపాడు ఎఇ, సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్ మినీ గ్రిడ్జ్ దగ్గర విద్యుత్ శాఖ సిబ్బంది, మోదేల గ్రామస్తులు

సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయాలి

పలు గ్రామాల్లో జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి - నిడమర్రు

సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యాన నిడమర్రు, చానమిల్లి, క్రొవిడి గ్రామాల్లో విశాఖలో జరుగుతున్న సిఐటియు 18వ అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలని కార్మికులు పిలుపునిస్తూ మంగళవారం జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి కార్మికులు పోరాడి సాధించుకున్న 28 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్పు చేసి కార్మిక హక్కులను అరించి వేసే పద్ధతుల్లో ఇచ్చిన నాలుగు లేబర్ కోడులు రద్దు చేయాలని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మికులు ఎనిమిది గంటల పని దినాన్ని 10 గంటలకు పెంచుతూ ఇచ్చిన మెమో రద్దు చేయాలని కోరుతూ జనవరి 4వ తేదీ విశాఖలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కానూరు రాజు, కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, వెలగలేటి మోహన సారిక, లలిత, కోన జయమ్మ, అల్లు సత్యవతి పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి పోలీస్ స్పోర్ట్స్ మీట్

ఏలూరు రేంజ్ ఐజి జివిజి.అశోక్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రజలకు అన్ని రకాలుగా సేవలు అందిస్తున్న పోలీసు సిబ్బంది మానసికోల్లాసం కోసం ప్రతి ఏడాది పోలీస్ స్పోర్ట్స్ నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది సిబ్బంది చురుగ్గా పాల్గొని ఆయా సబ్ డివిజన్ల సత్తా చాటారని ఏలూరు రేంజ్ ఐజిపి జివిజి అశోక్ కుమార్ తెలిపారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ మైదానంలో రెండు రోజులపాటు పోలీసు స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సభ్యులకు జిల్లా పోలీసు ఆటగాళ్లు పాల్గొని క్రికెట్, కబడ్డీ, 200 మీటర్ల పరుగు పందెం, 800 మీటర్ల పరుగు పందెం, బ్యాడ్మింటన్, హై జంప్ వంటి వాటిలో తమ సత్తా చాటారు. ఈ ఆటల పోటీల్లో ఎన్నో ఏళ్లుగా టెక్నికల్ టీం ఎఆర్ క్రికెట్ ఆటలో విజయం సాధిస్తూ వచ్చింది. ఈసారి ఏలూరు సబ్ డివిజన్ పోలీస్ ఆటగాళ్లు ఎఆర్ టీమ్‌ను ఓడించి కప్పును కైవసం చేసుకున్నారు. అలాగే ఈ స్పోర్ట్స్ మీట్‌లో మహిళ పోలీసు క్రీడాకారులు కూడా ఆయా సబ్ డివిజన్ల వారీగా తమ సత్తాను చాటారు. ఈ స్పోర్ట్స్ మీట్ ముగింపు వేడుకలను మంగళవారం రాత్రి ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ ఘనంగా నిర్వహించారు. ఏలూరు రేంజ్ ఐజిపి జివిజి అశోక్ కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆటల పోటీల్లో గెలిచిన టీమ్‌కు ఐజి అశోక్ కుమార్ బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్‌పి జి.ముని రాజా, ఏలూరు డిఎస్‌పి డి.శ్రావణ్ కుమార్, పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వర్ రావు, నూజివీడు డిఎస్‌పి కెవివిఎన్‌వి.ప్రసాద్, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్‌పి యు.రవిచంద్ర, డిటిసి డిఎస్‌పి సిహెచ్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపొందిన టీమ్‌తో ఐజిపి అశోక్ కుమార్, ఎస్‌పి

ఉద్యోగి మరణం కుటుంబానికి తీరని లోటు

జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్

కారుణ్య నియామకం కింద 13 మందికి ఉత్తర్వులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా ప్రజాపరిషత్ పరిధిలో ఇటీవల మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాలకు అండగా నిలుస్తూ జిల్లా ప్రజాపరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మంగళవారం కారుణ్య నియామకాల కింద అర్హత గల 13 మంది కుటుంబ సభ్యులకు నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగి మరణం కుటుంబానికి తీరని లోటని, అటువంటి క్లిష్ట సమయంలో ప్రభుత్వం, స్థానిక సంస్థలు బాధిత కుటుంబాలకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత ఉందని అన్నారు. కారుణ్య నియామకాలు బాధిత కుటుంబాలకు ఆర్థిక భద్రతను కల్పించి, వారి జీవితాల్లో స్థిరత్వాన్ని తీసుకువస్తాయని తెలిపారు. నియామక ఉత్తర్వులు పొందిన నూతన ఉద్యోగులు ప్రజాసేవనే లక్ష్యంగా తీసుకుని, నిజాయితీగా విధులు నిర్వర్తించాలని సూచించారు. జిల్లా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆమె కోరారు. అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా జిల్లా ప్రజాపరిషత్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ స్పష్టం చేశారు.

నియామక పత్రాలు అందుకున్న వారితో జెడ్‌పి ఛైర్‌పర్సన్

దామోదరం మృతికి సంతాపం : సిపిఎం

ఏలూరు అర్బన్: వీరవల్లి దామోదర మృతికి సిపిఎం జిల్లా కమిటీ తీవ్ర సంతాపాన్ని ప్రకటించింది. ఈమేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటన విడుదల చేస్తూ దామోదరం కుటుంబ సభ్యులకి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. దామోదరం ప్రారంభ దశలో సిపిఎం పార్టీ సభ్యునిగా యువజన రంగంలో పని చేశారని, పార్టీ పూర్తి కాలం కార్యకర్తగా కొంతకాలం పనిచేసి పార్టీ పూర్వ జిల్లా కమిటీ సభ్యులుగా కూడా ఉన్నారని పేర్కొన్నారు. ఆయన పార్టీ బాధ్యతలతో పాటు చేతి వృత్తిదారుల సంఘం జిల్లా నాయకునిగా, గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం, గీత కార్మిక సంఘం జిల్లా నాయకులుగా పనిచేశారని పేర్కొన్నారు. 2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ పోరాటంలో భాగంగా హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ఘటనలో ఆనాటి చంద్రబాబు నాయుడు ధమనకాండలో తల పగిలి తీవ్రంగా గాయపడ్డారని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం సొంత పనిపై దామోదరం నంద్యాల వెళ్లిన సందర్భంగా అక్కడ గుండెపోటుకు గురై మృతిచెందారని, ఆయన మృతికి తీవ్ర సంతాపాన్ని ప్రకటిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

ద్వారకాతిరుమల: మండలంలోని వెంకట కృష్ణాపురం గ్రామంలో రాజమండ్రి పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురందేశ్వరి స్థానిక ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకట రాజు రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన పంచాయతీ భవనం ప్రారంభోత్సవం, రహదారులు, డ్రెయినేజీలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఈడా ఛైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజుతో కలిసి ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన వారికి ముందుగా దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎన్‌విఎస్‌ఎన్.మూర్తి, అర్చకులు స్వాగతం పలికారు. ఆలయ ఎఇ చినవెంకన్న జ్ఞాపికలను, ప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఉంగుటూరు: ఆపత్కాలంలో ఆదుకునేందుకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు బాధితులకు అండగా నిలుస్తాయని ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మంగళవారం నారాయణపురం క్యాంపు కార్యాలయంలో 21 మంది లబ్ధిదారులకు రూ.24 లక్షల 65 వేల చెక్కులను అందించారు. పలువురికి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ఎల్‌ఒసి(లెటర్ ఆఫ్ క్రెడిట్)లను సైతం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇంత వరకూ 473 మంది లబ్ధిదా రులకు రూ.3 కోట్ల 97 లక్షల 31 వేలు అందించామన్నారు. ఆయా గ్రామాల నాయకుల సమక్షంలో వీటిని బాధిత కుటుంబాలకు అందించారు.

ఏలూరు సిటీ : ఏలూరు శాంతి నగర్‌లోని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ జరిగింది. వివిధ ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతూ, వైద్యం కోసం ఆర్థిక సాయం కోరుతూ ఎంపీ కార్యాలయానికి వచ్చిన 66 మంది లబ్ధిదారులకు 45 లక్షల విలువైన సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఎంపీ కార్యాలయ సిబ్బంది, పోలవరం నియోజకవర్గానికి చెందిన టిడిపి ముఖ్య నేతలు పాల్గొన్నారు.

శ్మశానంలో మోటారు బోరు, విద్యుత్ కేబుల్ అపహరణ

ఉంగుటూరు : నారాయణపురం టూరింగ్ పేట బిసి శ్మశాన వాటిక వద్ద ఉన్న బోరుకు సంబంధించి మోటార్ కేబుల్‌ను దొంగలు రాత్రి కోసుకుపోయారు. విద్యుత్ సరఫరా అందించే ఫోర్ స్క్వేర్ కేబుల్‌ను ఇలా దొంగలించడం ఇది రెండోసారి అని సర్పంచి దిడ్ల అలకనంద తెలిపారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో బోరు పనిచేయటం లేదు. కేబుల్ దొంగలపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నారు.

'వ్యాయామంతో ఆరోగ్యం'

ముసునూరు : ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ప్రతిరోజు నిత్యం వ్యాయామం చేసినట్లయితే ఆరోగ్యంగా ఉంటారని ఫిజియోథెరపిస్టు జి.ప్రశాంతి పేర్కొన్నారు. మంగళవారం మండలం పరిధిలోని రమణక్కపేట మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిజియోథెరపీతో ఆరోగ్యంగా ఉండటమే కాకుండా మానసిక ఒత్తిడి కూడా తగ్గుతుందని అన్నారు. ఐఇఆర్‌పి ఉపాధ్యాయులు డివిఎం.లక్ష్మీనారాయణ, జె.నాగమల్లేశ్వరి, సిబ్బంది, పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

మొన్న భర్త, నిన్న భార్య మృతి

ప్రజాశక్తి - మండవల్లి

రోడ్డు ప్రమాదంలో కానుకొల్లు గ్రామానికి చెందిన భర్త అక్కడికక్కడే మృతిచెందగా.. చికిత్స పొందుతూ భార్య మృతిచెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధితుల కథనం ప్రకారం మండలంలోని కానుకొల్లు గ్రామానికి చెందిన పాలెపు వెంకన్న(41), గృహలక్ష్మి(37)లకు డిగ్రీ, ఇంటర్మీడియట్ చదివే యువతులతో పాటు ఒక మగ పిల్లవాడు ఉన్నాడు. అయితే ఆడపిల్లలు ఇరువురు విజయవాడలో హాస్టల్లో ఉంటూ విద్యను అభ్యసిస్తున్నారు. ప్రతి నెలా విజయవాడ వెళ్లి వారిని చూసి తిరిగి కానుకొల్లు వస్తుంటారు. 21న కూడా కుమార్తెల దగ్గరకు వెళ్లేందుకు ఆదివారం ఉదయం కానుకొల్లు నుండి ద్విచక్ర వాహనంపై విజయవాడకు బయలుదేరారు. విజయవాడ-కంకిపాడు మార్గమధ్యంలో కోమటికుంట లాకులు కంకిపాడు మార్గమధ్యంలో మితిమీరిన వేగంతో వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో వెంకన్న అక్కడికక్కడే మృతిచెందగా గాయాలపాలైన గృహలక్ష్మిని వైద్య నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. గృహలక్ష్మి వైద్యం పొందుతూ మంగళవారం మృతిచెందింది. తల్లి కూడా మృతి చెందిందని వార్త విన్న కుమారుడు, కుమార్తెలు కన్నీటి పర్యంతమయ్యారు. సమాచారం అందుకున్న ఎంఎల్‌ఎ జయమంగళ వెంకటరమణ కానుకొల్లు చేరుకుని మృతదేహాలను సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. భార్యాభర్తలు మృతి చెందడంతో పిల్లలు ఒంటరి వారు అయ్యారు. దీంతో గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రైలు పట్టాలు దాటుతున్న వ్యక్తిని గుర్తుతెలియని రైలు ఢీ కొట్టడంతో అతను ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఈ ఘటన దెందులూరు మండలం సీతంపేట వద్ద మంగళవారం చోటుచేసుకుంది. రైల్వే ఎస్‌ఐ శివన్నారాయణ తెలిపిన వివరాల ప్రకారం దెందులూరు మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన కాళీ సందీప్ కుమార్ అలియాస్ సన్నీ(24) బిటెక్ పూర్తి చేసి ప్రయివేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈక్రమంలో మంగళవారం ఇంటి నుండి బయటకు వెళ్లిన అతను రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొంది. ఈ ఘటనలో అతని శరీరం ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అతని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై రైల్వే ఎస్‌ఐ శివన్నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

20 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరణ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఇంటికి తాళాలు వేసి కుమార్తె ఇంటికి వెళ్లిన వృద్ధురాలు ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి 20 గ్రాముల బంగారు ఆభరణాలను అపహరించుకుపోయారు. ఈ ఘటన మంగళవారం ఏలూరు నగరంలోని చోడిదిబ్బ ప్రాంతంలో చోటుచేసుకుంది. ఏలూరు రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని చోడిదిబ్బ ప్రాంతంలో ఉన్న రామాలయం సమీపంలో చింతల విజయలక్ష్మి అనే వృద్ధురాలు రెండు రోజుల క్రితం విశాఖలోని తన కుమార్తె వద్దకు వెళ్లగా తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. బీరువాలోని నగలు మాయమైనట్లు గుర్తించి రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎఎస్‌ఐ మధు వెంకటరావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెసేజీ ఓపెన్ చేస్తే..

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఉదయం లేచిన వెంటనే సెల్‌ఫోన్‌లో వచ్చిన ఎం పరివాహన మెసేజ్‌ను ఓపెన్ చేసిన వ్యక్తి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి రూ.90 వేలు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన ఏలూరు నగరంలో చోటుచేసుకుంది. ఏలూరు ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు నగరంలోని దక్షిణపు వీధి చెందిన డేగా నాగ వెంకట సత్యనారాయణ స్థానికంగా కుటుంబంతో కలిసి జీవిస్తున్నాడు. ఈనెల 17వ తేదీన ఉదయం ఆయన సెల్‌ఫోన్‌కు ఎం పరివాహన అనే పేరుతో ఒక మెసేజ్ వచ్చింది. వెంటనే ఆ మెసేజ్‌ను ఓపెన్ చేసిన వెంటనే తన ఖాతాలో ఉన్న రూ.90 వేలు దఫదఫాలుగా అపహరణకు గురయ్యాయి. ఈ విషయాన్ని గుర్తించిన ఆయన వెంటనే సెంట్రల్ సైబర్ సెల్ 1930కి ఫిర్యాదు చేశారు. అనంతరం మంగళవారం రాత్రి ఏలూరు వన్ టౌన్ పోలీసులకు తిరిగి ఫిర్యాదు చేశారు. దీనిపై వివరాలు చేపట్టిన వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

విద్యార్థులు గంజాయికి దూరంగా ఉండాలి

యుటిఎఫ్ మండల అధ్యక్షురాలు ఎం.పోశమ్మ

జీలుగుమిల్లి : విద్యార్థులు గంజాయికి దూరంగా ఉండాలని యుటిఎఫ్ మండల అధ్యక్షురాలు ఎం.పోశమ్మ పిలుపునిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని మడకంవారిగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో గంజాయి మహమ్మారి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాల జోలికి పోయి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు, మండల కార్యవర్గ సభ్యులు చెన్నారావు, సోమేశ్వరరావు, వెంకటేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.పుల్లారావు, ఉపాధ్యాయులు ఎం.ఆకాశరావు, రామారావు, సూర్యచంద్రం పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

ఉంగుటూరు : నారాయణపురం శ్రీఅరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్థిక శాస్త్ర విభాగం ఆధ్వర్యాన జాతీయ రైతు దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ కొండా రవి మాట్లాడుతూ భారతదేశం వేల సంవత్సరాలుగా వ్యవసాయ దేశంగా కొనసాగుతుంది కానీ నేటికీ వ్యవసాయం చేసే రైతులకు లాభసాటిగా లేదని, అయినప్పటికీ నిస్వార్థంగా రైతు నిత్యం శ్రమిస్తూనే ఉంటున్నారన్నారు. అటువంటి రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, వ్యవసాయ రంగంలో ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, మరింత ఎక్కువ దిగుబడులు సాధించి, పంటలకు తగిన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించి రైతులను ప్రోత్సహించాలన్నారు. లేనట్లయితే భవిష్యత్తులో వ్యవసాయం చేసే రైతులు కరువైపోయే ప్రమాదం ఉందన్నారు. ఆర్థిక శాస్త్ర విభాగ అధ్యక్షులు గుమ్మడి నిర్మల జ్యోతి మాట్లాడారు. కార్యక్రమంలో భౌతిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ బి.వెంకటేశ్వర్ రెడ్డి, కామర్స్ అధ్యక్షులు జి.రామ్మోహన్, మణిచంద్రరావు, రఘునాథ్, లావణ్య పాల్గొన్నారు.

చేగొండపల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం

పోలవరం : ఎపి స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి ఆధ్వర్యాన మండలంలోని చేగొండపల్లి పునరావాస గ్రామంలో శాప్ డైరెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. చేగొండపల్లి పరిసర ప్రాంతాల నుండి ఎల్లండిపేట, జిల్లెల్లగూడెం, ఇటుకలకోట, పోలవరం పంచాయతీల నుండి అధిక సంఖ్యలో కంటి సమస్యల బాధితులకు ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. కళ్లజోళ్లు అవసరమైన వారి పేర్లు నమోదు చేసుకుని కళ్లజోళ్లు కూడా ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు శాప్ డైరెక్టర్ జగదీశ్వరి తెలిపారు. ప్రజల ఆరోగ్య భద్రతకు, సంక్షేమానికి, సేవకు కూటమి ప్రభుత్వం కట్టుబడిట్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. సుమారు 200 మందికిపైగా ఉచిత కంటి వైద్య సేవలు పొందినట్లు వైద్యులు తెలిపారు.

ఆర్‌జియుకెటిలో వర్క్‌షాప్

నూజివీడు టౌన్: ఆర్‌జియుకెటి నూజివీడు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సిఎస్‌ఇ) విభాగం ఆధ్వర్యాన 'పైథాన్‌తో గేమ్ డెవలప్‌మెంట్' అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్ విజయవంతంగా నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కు గుంటూరుకు చెందిన 'అక్యురైజ్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాజేశ్ పాకనాటి ముఖ్య వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు గేమ్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన ప్రాక్టికల్ ప్రోగ్రామ్‌లపై విశేష అవగాహన కల్పించారు. ముఖ్యంగా అవసరమైన మాడ్యూల్స్‌ను ఇన్‌స్టాల్ చేయడం, వాటిని ఇనిషియలైజ్ చేయడం వంటి ప్రాథమిక అంశాలతో పాటు గేమ్ అభివృద్ధిలో హృదయం లాంటి గేమ్ లూపింగ్ కాన్సెప్ట్‌పై ప్రధానంగా దృష్టి సారించారు. ఈ వర్క్‌షాప్‌లో 90 శాతం ప్రాక్టికల్ గేమింగ్ కోడింగ్‌పై దృష్టి సారించడంతో ఇది పూర్తిగా విద్యార్థి కేంద్రిత వర్క్‌షాప్‌గా నిలిచింది. విద్యార్థులు ఈ కార్యక్రమం ద్వారా ఎంతో లాభపడ్డారని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వక్త రాజేశ్ ఈ అవకాశాన్ని కల్పించిన ఆర్‌జియుకెటి యాజమాన్యానికి, నిర్వహణలో పాల్గొన్న అధ్యాపకులకు, విద్యార్థి బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సిఎస్‌ఇ విభాగాధిపతి అంబటి ఉదయ్‌తో పాటు రామకృష్ణ, చల్లపల్లి శ్రీనివాస్, ఇతర అధ్యాపకులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు

ముసునూరు : ఏసుక్రీస్తు చూపించిన శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని, ఆయన అందించిన ప్రేమను సర్వ మానవాళికి అందించాలని గోపవరం(బిసి) ఏరియా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొప్పుల బాబూరావు అన్నారు. మంగళవారం మండలం పరిధిలోని గోపవరం బిసి ప్రాథమిక పాఠశాలలో సేమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని దాసరి ఝాన్సీ, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమడోలు : ఏసుక్రీస్తు బోధనలు అందరికీ ఆచరణీయమని భీమవరం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఆచార్యులు గాలయ్య, పొలసానిపల్లి గ్రామానికి చెందిన పాస్టర్ యేసయ్య కోరారు. భీమడోలు శ్రీమాధురి జూనియర్ కళాశాల ఆవరణలో కరస్పాండెంట్ కె.ప్రేమ్ కుమార్ ఆధ్వర్యాన సెమీ క్రిస్మస్ కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా పాల్గొన్న ఆచార్య గాలయ్య, పాస్టర్ యేసయ్య విద్యార్థులు విద్య నేర్చుకోవడంతో పాటు, నైతిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

దెందులూరు : ఏలూరు సెయింట్ అంథోని పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. రెవరెండ్ ఫాథర్ తోట అంథోని రాజ్ కేక్ కోసి చిన్నారులకు తినిపించారు. పాఠశాల ప్రతినిధి తోట ఎడ్వర్డ్, పి.ఉషారాణి, అంథోని పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ముదినేపల్లి : క్రీస్తు మార్గం అనుసరణీయమని పాస్టర్ టి.మరియ దాస్ అన్నారు. మండలంలోని పెనుమల్లి సీయోను ప్రార్ధన మందిరాల వ్యవస్థాపక అధ్యక్షులు మరియదాసు ఆధ్వర్యాన మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సెమీ క్రిస్మస్ వేడుకకు ముఖ్య వాక్యోపదేశకులు పాస్టర్ యేసు పోగు రాజు(క్రైస్ట్ ఫెలోషిప్ చర్చ్ మచిలీపట్నం) పాల్గొని ఏసుక్రీస్తు పుట్టుక గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా ఎ లిటిల్ ఫ్లవర్ ది లీడర్ సంస్థల అధినేత బొర్రా చలమయ్య, మాల మహానాడు అనుబంధ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సేవా నాగ జగన్ బాబురావు, అన్ని సంఘాల పాస్టర్స్ 25 మందికిపైగా పాల్గొన్నారు.

ఛాంపియన్స్‌గా వికాస్ విద్యార్థులు

ముదినేపల్లి: యువ భారత్ జిల్లా స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యాన జిల్లా స్థాయిలో భీమడోలులో జరిగిన వివిధ ఆటల పోటీల్లో ముదినేపల్లికి చెందిన వికాస్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. ఈ కళాశాల విద్యార్థులు కబడ్డీలో బాలికలు మొదటి స్థానం, 100 మీటర్ల రన్నింగ్‌లో బాలికలు, బాలురు మొదటి స్థానం, అలాగే షాట్ పుత్‌లో బాలురు ఫస్ట్ ప్లేస్ సాధించి ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పిఇటి శివ కోటయ్య, కరస్పాండెంట్ మదన్ కిషోర్, గౌతమ్ స్కూల్ ప్రిన్సిపల్ కెవి.సుబ్బారావు విజేతలను అభినందించారు.

ఎస్‌ఆర్ నగర్‌కు నీళ్లు, కరెంటు ఇవ్వాలి

ఎంఎల్‌ఎ బాలరాజుకు కాలనీవాసుల వినతి



ఎంఎల్‌ఎకు వినతిని అందజేస్తున్న కాలనీ వాసులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఎస్‌ఆర్ నగర్ ప్రజలకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజుకు మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మండలంలో జనవాణి కార్యక్రమానికి వెళ్తున్న బాలరాజును స్థానిక ఎస్‌ఆర్ నగర్ వద్ద ఆపి కాలనీవాసులు తమగోడు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు గుడెల్లి వెంకట్రావు, స్థానికులు మాట్లాడుతూ గ్రామంలో నీరు, కరెంటు వంటి సౌకర్యాలు లేక నానావస్థలు పడుతున్నామన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించాలని హైకోర్టు కూడా ఉత్తర్వులు జారీ చేసిందని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సరైన వసతులు లేక ఏళ్ల నాటి నుండి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఎస్‌ఆర్ నగర్ భూమి కోర్టులో ఉందని చెబుతూ అధికారులు మాట దాటేస్తున్నారుగానీ సమస్యలు పరిష్కరించడం లేదని వాపోయారు. వాస్తవంగా కేసును హైకోర్టు కొట్టేసిందని, అందుకు సంబంధించిన జిరాక్స్ కాపీలు ఆయనకు అందించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఎల్‌ఎ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మడకం కుమారి, బరగడ కుమారి, వి.లక్ష్మి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకోవాలి

వ్యవసాయాధికారి ఉషారాణి

అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయాధికారి

ప్రజాశక్తి - భీమడోలు

రైతులు సమస్యల పరిష్కారం కోసం సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకోవచ్చునని వ్యవసాయాధికారి ఉషారాణి తెలిపారు. సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా భీమడోలు వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన దుద్దేపూడిలోని రైతుసేవా కేంద్రం వద్ద సమాచార హక్కు చట్టంపై అవగాహనా సదస్సును మంగళవారం నిర్వహించారు. పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వ్యవసాయాధికారి ఉషారాణి మాట్లాడుతూ రైతులు విత్తనము కొనుగోలు నుంచి ధాన్యాన్ని మిల్లులకు తరలించి వాటి చెల్లింపులు జరిగేంత వరకు అవసరమైన పనుల ప్రగతిని పరిశీలించేందుకు సమాచార హక్కు చట్టం, టోల్ ఫ్రీ నెంబర్ల సేవలను పొందవచ్చునన్నారు. కొందరు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అమలు చేసే సహాయ, సంక్షేమ పథకాల ప్రగతిని తెలుసుకునేందుకు సమాచార హక్కు చట్టాన్ని ఒక ఆయుధంగా వినియోగించుకోవచ్చునని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి నీలం శ్రీనివాసరావు, మాజీ సర్పంచి నారాయణమూర్తి పాల్గొన్నారు.

ఎంపియుపి పాఠశాలలో ఎన్‌ఎస్‌ఎస్ సేవా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, నూజివీడు క్యాంపస్‌కు చెందిన జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్) యూనిట్-8 ఆధ్వర్యాన సమీప గ్రామమైన యానాది కాలనీలో మంగళవారం ఉదయం ఎంపియుపి పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. అలాగే విజేతలకు, ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పియుసి డీన్ ఆఫ్ అకాడమిక్ కె.రఘుకుమార్ చేతుల మీదుగా బహుమతుల పంపిణీ జరిగింది. ఆ తర్వాత వాలంటీర్లు, విద్యార్థులకు డిజిటల్ లిటరసీ మీద అవగాహన కల్పించి, విద్య గొప్పతనాన్ని విద్యార్థులకు చక్కగా వివరించారు. బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత మీద ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు అవగాహన కల్పించారు. భోజనం అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పాఠశాల ఆవరణ చుట్టూ ఉన్న ప్రాంతంలో శ్రమదానం చేశారు. నూజివీడు ఐఐఐటి డైరెక్టర్ డాక్టర్ అమరేంద్ర కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ లక్ష్మణరావు కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించారు. అలాగే డైరెక్టర్ ఎంపియుపి పాఠశాల ప్రిన్సిపల్‌ని, అలాగే మిగతా టీచర్స్‌ని, ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమానికి సహకరిస్తున్నందుకు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమాన్ని చక్కగా నిర్వహిస్తున్నందుకు జి.డాక్టర్ భాను వినోలియాని డైరెక్టర్ స్వయంగా ప్రశంసించారు.

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక 'జనవాణి' కార్యక్రమం ప్రజా ఫిర్యాదులతో కిటకిటలాడింది. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలను ప్రత్యక్షంగా ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకువచ్చారు. జనవాణి కార్యక్రమానికి విచ్చేసిన పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు ముందుగా రుద్రకోట రాజుగూడెం గ్రామంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం టి.నర్సాపురంలోని శివాలయంలో స్వామివారిని దర్శించుకుని, అక్కడి నుంచి ర్యాలీగా జనవాణి వేదిక వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు ఎంఎల్‌ఎకు ఘన స్వాగతం పలికారు. వేదికపైకి చేరుకున్న అనంతరం ఎంఎల్‌ఎ ప్రజల నుంచి వచ్చిన వివిధ అంశాలపై అర్జీలను స్వీకరించారు. ప్రతి అర్జీని జాగ్రత్తగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులను వెంటనే అప్రమత్తం చేసి, సమస్యలపై లోతుగా చర్చించారు. ప్రజలు ఇచ్చిన ప్రతి ఫిర్యాదుకు స్పష్టమైన కాలపరిమితితో కూడిన నాణ్యమైన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన బాధ్యతని, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. జనవాణి వేదిక ప్రజలకు నమ్మకాన్ని కలిగించే వేదికగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, గండమనగు రవికుమార్, జనసేన మండల అధ్యక్షుడు అడపా నాగరాజు, పూనెం ఆదిత్య, టిడిపి రాష్ట్ర నాయకులు శీలం వెంకటేశ్వరరావు, జైవరపు శ్రీరామ్మూర్తి, జెడ్ల సత్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షుడు నాయుడు రామకృష్ణ గౌడ్, నెల్లూరి వెంకట చలపతిరావు, పిన్నమనేని మధు, ఆచంట సూర్యనారాయణ, నాలి చక్రవర్తి, కంపసాటి రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - దెందులూరు

బహుమతులందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెదవేగి మండలం తాళ్లగోకవరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గణితంలో పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యాకమిటీ ఛైర్మన్ కొన్నె గంగధరరావు, రాష్ట్ర ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, అతిథులు గుంటూరు శ్రీనివాసరావు, గణిత ఉపాధ్యాయులు రాంబాబు, బి.ధర్మారావు, ఉపాధ్యాయులు డాక్టర్ బి.వెంకట మాధవ, బి.రామారావు, పిఎల్.మేరీకుమారి ద్వారా విద్యార్థులకు అందజేశారు.

మోడల్ టెక్ట్స్ పేపర్ల ద్వారా అధిక మార్కులు

విద్యాశాఖ అధికారి ఎస్.రత్నసునాదం

మండవల్లిలో..

మండవల్లి: మోడల్ టెక్ట్స్ పేపర్ల ద్వారా అధిక మార్కులు సాధించవచ్చునని విద్యాశాఖ అధికారిని ఎస్.రత్నసునాదం తెలిపారు. మండలంలోని చింతపాడు ఇంగిలంపాక లంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు కీర్తిశేషులు టెలిఫోన్ రమేష్ కుమారుడు చలమలశెట్టి గంగాధర్ ఆర్థిక సహాయంతో యుటిఎఫ్ శాఖ ముద్రించిన మోడల్ టెక్ట్స్ పేపర్లను మంగళవారం విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక మార్కులు సాధించాలనుకునే విద్యార్థులకు, విద్యలో వెనుకబడిన విద్యార్థులకు ఈ మోడల్ టెక్ట్స్ పేపర్లు ఎంతగానో దోహదపడతాయన్నారు. దాతల ఆర్థిక సహాయంతో అందిస్తున్న ఈ టెక్ట్స్ పేపర్లను సద్వినియోగం చేసుకుని నూరు శాతం ఉత్తీర్ణత సాధించి, పాఠశాలకు, గ్రామానికి, మండలానికి మంచి కీర్తి ప్రతిష్టతలు తీసుకురావాలని ఆమె కోరారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థుల అభివృద్ధికి యుటిఎఫ్ శాఖ మోడల్ టెక్ట్స్ పేపర్లను తయారుచేసి అందించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భలే భాగ్యలక్ష్మి, డ్యూటీ ఆఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సిరిగిరి పిచ్చోడు, ఉపాధ్యాయులు ఎస్‌వి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : యుటిఎఫ్ రూపొందించిన పదవ తరగతి స్టడీ మెటీరియల్‌ను మంగళవారం ఏలూరు మండల విద్యాశాఖ అధికారి-1 ఎ.రవిప్రకాష్, మండల విద్యాశాఖాధికారి-2 వి.అరుణ్ కుమార్ చేతుల మీదగా సెయింట్ జేవియర్ పాఠశాల పదవ తరగతి విద్యార్థులు అందరికీ అందజేశారు. ఏలూరు నగర శాఖ ఉపాధ్యాయినులు పి.హైమావతి, ఎన్‌డిఎస్.లత, డిఎస్ సజని ఆర్థిక సహకారంతో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు, ఇంగ్లీష్ మీడియం పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రతాప్, ఐ.రాజ్ ప్రసాద్, యుటిఎఫ్ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి షణ్ముఖి, జొన్నకూటి రాజారావు పాల్గొన్నారు.

అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి : ఎంపిపి

ప్రజాశక్తి - మండవల్లి

అధికారులంతా సమన్వయంతో పనిచేసి అభివృద్ధికి సహకరించాలని ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ్ దుర్గాప్రసాద్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి చెందిన నాయకులు, అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలని అన్నారు. ఎంపిడిఒ రమణ బాబు మాట్లాడుతూ హెల్త్ సెంటర్లకు నిధులు మంజూరయ్యాయని, భవనాలను పూర్తిచేసే విధంగా పంచాయతీ ఇంజినీరింగ్ అధికారులు సహకరించాలని అన్నారు. అంతేకాకుండా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలకు తాగునీటి ఇబ్బంది కలగకుండా పూర్తి చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం పలు శాఖలకు చెందిన అధికారులు వారి శాఖల పనితీరును, సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఆగస్టు ఆది విష్ణు, ఇఒపిఆర్‌డి లక్ష్మీనారాయణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) - CUM-JUDICIAL I CLASS MAGISTRATE :: NIDADAVOLE
D.V.C.No.6/2024
Between :
Penmetsa Chandini, W/o. Sunil Kumar, D/o. Sagi Sita Rama Raju, Age : 28 Years, Female, Housewife, R/o. D.No.13-21-4/1, Subbarajupeta, Nidadavole Twon and Mandal, E.G.Dist., **...Petitioner**
And
1. Penmatsa Sunil Kumar, S/o. Venkata Subba Raju, Age : 36 Years, Male, Cultivation and Business, D.No.7-30, Pippara, Ganapavaram Mandal, Ganapavaram P.S.Limits, W.G.Dist.,
2. Penmatsa Parvatha Vardhini, W/o. Venkata Subbaraju, Age, 56 Years, Female, Properties, Door No.7-30, Pippara, Ganapavaram Mandal, Ganapavaram P.S.Limits, W.G.Dist.,
3. Uppalapati Annapurna, W/o. Dinesh, Age : 38 Years, Female, Properties, D.No.7-30, Pippara, Ganapavaram Mandal, Ganapavaram P.S.Limits, W.G.Dist.,
...Respondents
R3 : Uppalapati Annapurna, W/o. Dinesh, Age 38 Years, Female, Properties, D.No.7-30, Pippara, Ganapavaram Mandal, W.G.Dist.,
యీ నెంబరులో 3వ రెస్పాండెంటు దావా సమను కోర్టు ద్వారాను రిజిష్టర్డు పోస్టు ద్వారాను అనేక పర్యాయములు పంపిచినా అమలు జరగనందున శ్రీ కోర్టువారి వుత్తర్వుల ప్రకారం యీ ప్రకటన చేయడమైనది.
R3 : Uppalapati Annapurna, W/o. Dinesh, Age 38 Years, Female, Properties, D.No.7-30, Pippara, Ganapavaram Mandal, Ganapavaram P.S.Limits, W.G.Dist., అను వారు **ది.07-01-2026 తేదీన** పై కోర్టు వారు పిలిపించే టైముకు ఉదయం గం.10.30 లకు స్వయంగా కానీ ప్లీడరు గారి ద్వారా కానీ హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలియపరుచుకొనవలెను లేని యెడల ఎక్స్‌పార్టీ చేసి పరోక్షమున తీర్మాణించడమగును.
P.Venkanna Babu, B.Com, B.L., Advocate, Nidadavole, E.G.Dist., Cell : 93476 26143

పాత ఉపాధి హామీ చట్టాన్నే కొనసాగించాలి

ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - పోలవరం

నిరుద్యోగాన్ని, వలసలు పెంచి రాష్ట్రంపై ఆర్థిక భారాన్ని మోపే నూతన ఉపాధి హామీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని ఏజెన్సీ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం ఈ చట్టానికి నిరసనగా పోలవరం మ ండలంలో ఏజెన్సీ గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం ఆధ్వర్యాన భారీ ర్యాలీ నిర్వహించి స్థానిక ఏటిగట్టు సెంటర్‌లో ధర్నా నిర్వహించి నినాదాలు చేశారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి నినాదాలు చేసి ఎంపిడిఒ చెరుకూరి శ్రీనివాసబాబుకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ భాషా, ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు, జిల్లా నాయకులు సవలం రాంబాబు, మిడియం రవిదొర పాల్గొన్నారు.

CHANGE OF NAME
I **MAMIDISETTI SIVA SANKAR** S/o Mamidisetti Peddi Raju, D.No: 1-49, Mamidisetti Vari Meraka, Turpatallu Village, Narasapur Mandal, W.G.Dt, A.P. I have changed my Name from **MAMIDISETTI SIVA SANKAR RAO** (Old Name) to **MAMIDISETTI SIVA SANKAR** (New Name). Henceforth I am being called **MAMIDISETTI SIVA SANKAR** S/o Mamidisetti Peddi Raju for all purposes.

ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No.197/2018
Between:
ముమ్మిడి పెద్దింట్లు ...వాది
మరియు
గంగుల సుబ్బారావు వగైరా ...ప్రతివాద్లు
పై నెంబరు గ్రంథంలో 11వ రెస్పాండెంటు అయిన ముమ్మిడి వుజారయ్య తండ్రి సుబ్బారావు, యర్రమిల్లిపాడు, ఉంగుటూరు మండలం అను శ్రీకోర్టు వారి నోటీసులు సమన్లు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున మీరు ది.29.12.2025 సం॥ తేదీ పగలు 10.30 గంటలకు స్వయముగా గాని ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కానిచో మీ పరోక్షమున తీర్మానించబడునని ఈ ప్రకటన మూలముగా తెలియచేయడమైనది.
శ్రీకోర్టు వారి వుత్తర్వులు మేరకు
కాజ నాగేశ్వరరావు
అడ్వకేట్,
తాడేపల్లిగూడెం
సెల్: 99895 38628

ప్రకటన
IN THE COURT OF THE Ist ADDL. JUNIOR CIVIL JUDGE, BHIMAVARAM
O.S.368/2024
Between:
Plaintiff : Canara Bank, JP Road, Branch, Bhimavaram, Rep by its Branch Manager.
Defedants : M/s.R.S.Vastralayam, Bhimavaram, Rep by its Prop: Nimmala Rama Srinivas and another
1st Defendant Address :
M/s.R.S.Vastralayam, S/o.Venkata Subba Rao, Business, D.No.17-6-14, Mantevari Street, Bhimavaram.
2nd Defendant Address :
Nimmala Rama Srinivas, S/o.Venkata Subba Rao, Business, D.No.17-6-34, Angel cut pices, Mantevari Street, Bhimavaram.
పై నెంబరు దావాలో ప్రతివాదులకు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ అవి అందుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. వారి తరపున ప్రతివాదులపై శ్రీకోర్టు వారు పేపరు పబ్లికేషన్ ఆర్డరు వేసినారు. ప్రతివాదులు ది.30.12.2025 తేదీన ఉదయం గం.10.30 ని॥లకు కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కావలెను. లేని ఎడల శ్రీ కోర్టు వారు మీపై Exparte ఉత్తర్వులు జారీ చేయగలరని తెలియజేయుచున్నాము.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
భీమవరం **అత్తి శివరామకృష్ణ,** అడ్వకేట్,
తేది.10-12-2025 శ్రీరాంపురం, భీమవరం.

వేలం ప్రకటన
మహారాజశ్రీ భీమవరం ఫస్ట్ ఎడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో భీమవరం
ఇ.పి.నెంబరు 5/2024 ఇన్
ఓ.యస్.నెం.36/2021
బిట్వీన్ :
అల్లు శ్రీనివాసరావు, S/o.పాండురంగారావు, నివాసం డో.నెంబరు.22-9-6, నంబులవారి వీధి, భీమవరం-1, భీమవరం మండలం, ప.గో.జిల్లా. ...డి.హెచ్.ఆర్.
మరియు
శ్రీమతి దొక్కు వెంకటలక్ష్మి, W/o.లేటు మారియ్య, నివాసం డోరునెం.6-18, రామాలయం వద్ద, గరువు పాలకోడేరు గ్రామం మరియు మండలం, ప.గో.జిల్లా. ...జె.డి.ఆర్.
వేలం ఆస్తి వివరము :
పశ్చిమ గోదావరి జిల్లా ఉండి సబ్ రిజిష్ట్రారు వారి యిలాకా కాళ్ళ మండలం బొండాడ గ్రామం ఆర్.ఎస్.నెంబరు 12/1లో చ.గ. 482.88లులో దక్షిణం వైపు చ.గ. 121 లు గల పైన తెలిపిన జెడిఆర్ యొక్క సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలో ఉండి యీ డిక్రీ బాకీ క్రింద జప్తు కాబడి వేలం కావలసియున్న ఆసిక్తి హద్దులు :
తూర్పు : గొర్ల వెంకట కరుణ కృష్ణ కుమారి గారి స్థలం.
పడమర: రాజవీధి
ఉత్తరం : కోరశిఖ వెంకటేశ్వరరావు స్థలం మరియు ఇతరులు
దక్షిణం : రాజవీధి
డి.హెచ్.ఆర్.విలువ : రూ.5,79,000/-
అమీన విలువ : 9,00,000/-
పైన తెలిపిన ఆస్తి శ్రీకోర్టు వారు ది.19-01-2026 సం॥ తేదీన ఉదయం గం.10.30 ని॥లకు బహిరంగ వేలము వేయుదురు.
కావున కావలసిన వారు పాడుకొనవచ్చును.
కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం వేలం పాటలో పాల్గొనదలచిన వారు ఆధార్ కార్డుతో సహా హాజరు కావలెను.
ఇంజేటి వెంకటేశ్వర్లు
డి.హెచ్.ఆర్ తరపు న్యాయవాది
భీమవరం భీమవరం.
తేది.23.12.2025 సెల్: 9441155455